




# కరపత్రం

SINCE 2014

గురువారం మార్చి 13 2025 | సంపుటి :0 | సంచిక : 150 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4




## అసెంబ్లీ సమావేశాలకు విధిగా హాజరు కావాలి



2లో..

- ప్రతి విషయంలోనూ అవగాహనతో ఉండాలి
- విపక్షాల విమర్శలను ధీటుగా ఎదుర్కోవాలి
- సిఎల్‌పి భేటీ సీఎం రేవంత్ స్పష్టమైన ఆదేశాలు

**హైదరాబాద్,మార్చి12 :**
అసెంబ్లీ సమావేశాలకు అందరు ఎమ్మెల్యేలు తప్పనిసరిగా హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రతిపక్షాలు గందరగోళం చేసే ప్రయత్నం చేస్తాయని, సంయమనంతో వ్యవహరించాలని సీఎం సూచించారు. అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని పలు సూచనలు చేశారు. సభలో వ్యవహరించాల్సిన విధానంపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ప్రజా ప్రభుత్వంలో ఇవి రెండో పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలని, అత్యంత కీలకమైనవిగా సీఎం స్పష్టం చేశారు. ఈ 15నెలల్లో ప్రజా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై పూర్తిగా చర్చించుకునేందుకు ఈ సమావేశాల్లో అవకాశం ఉందన్నారు. సభ్యులందరూ కచ్చితంగా రావాల్సిందేనని, ప్రతిపక్షాల విమర్శలను ధీటుగా ఎదుర్కోవాలన్నారు. సమావేశాల్లో సభ్యులంతా సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. అంశాల వారీగా ప్రిపేర్ అయి సభకు రావాలని తెలిపారు. సభ్యుల హాజరుపై ప్రభుత్వ విప్‌లు పర్యవేక్షించాలని సూచించారు. కొందరు ఎమ్మెల్యేలు అసెంబ్లీని నిర్లక్ష్యం చేస్తున్నారని ఈ సందర్భంగా సీఎం అసహనం వ్యక్తం చేశారు. హాజరైతేనే సభలో ఏం జరుగుతుందో తెలుస్తుందన్నారు.

## నియోజకవర్గాల పునర్విభజనపై త్వరలో అఖిలపక్ష భేటీ



**హైదరాబాద్:**
నియోజకవర్గాల పునర్విభజన పై త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి.. రాజకీయ పార్టీలకు బహిరంగ లేఖ రాశారు. క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయం ప్రకారం నియోజకవర్గాల పునర్విభజనపై అఖిలపక్ష భేటీ నిర్వహించాలనుకుంటున్నట్లు లేఖలో పేర్కొన్నారు."జనాభా ప్రాతిపదికన జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనతో తెలంగాణకు ప్రమాదం. జరగబోయే నష్టం గురించి అన్ని పార్టీలను ఆహ్వానించి చర్చించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఏర్పాటు చేస్తున్న ఈ సమావేశానికి అన్ని పార్టీలు హాజరుకావాలి. ప్రతి పార్టీని ప్రత్యేకంగా ఆహ్వానిస్తాం. త్వరలోనే భేటీకి సంబంధించిన తేదీ, వేదిక ప్రకటిస్తాం" అని లేఖలో పేర్కొన్నారు.

## తెలంగాణ హైకోర్టులో కేటీఆర్‌కు ఊరట



**హైదరాబాద్ :**
తెలంగాణ హైకోర్టు లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు హైకోర్టు ఊరట దక్కింది. ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో దాఖలైన కేసును హైకోర్టు కొట్టివేసింది.అసెంబ్లీ ఎన్నికల ప్రచార ర్యాలీలో భాగంగా బాణసంచా కాల్చి ప్రజలకు ఇబ్బంది కలిగించారంటూ ఫిర్యాదులందాయి. ఆ ఫిర్యాదులపై కేటీఆర్,ముఠా గోపాల్‌పై ముషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు.ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని హైకోర్టులో బీఆర్ఎస్ నేతలు పిటిషన్లు దాఖలు చేశారు. వాదనలు విన్న జస్టిస్ కె.లక్ష్మణ్ కేసును కొట్టివేశారు.



## ఏప్రిల్ లో గద్దర్ అవార్డ్స్..

### 2014 జూన్ నుంచి 2023 వరకూ రిలీజైన బెస్ట్ సినిమాలకు ప్రదానం

**హైదరాబాద్**
గద్దర్ పేరు మీద తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్ ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం ప్రత్యేక జ్యూరీ కమిటీని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. అందులో భాగంగా 2014 జూన్ నుంచి 2023 వరకు రిలీజ్ అయిన బెస్ట్ సినిమాలకు అవార్డ్ ఇస్తామని తెలిపింది.
అలాగే, 2014 నుంచి %టసఎ%కి సింహా అవార్డ్స్ కోసం కొందరు చెల్లించిన డబ్బులు తిరిగి ఇచ్చేస్తామని ప్రభుత్వం వెల్లడించింది. ఇక నుంచి తెలంగాణ రాష్ట్రం నుంచి అవార్డ్స్ వస్తున్నాయి కాబట్టి ప్రతిఒక్కరూ సపోర్టు చేయాలని కోరింది. ఈ సందర్భంగా నేడు (మార్చి 12న) తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.
మంగళవారం (మార్చి 11న) గద్దర్ పురస్కారాలకు సంబంధించి విధి విధానాలతో కూడిన ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రభుత్వం జీవో నంబరు 25ని విడుదల చేస్తూ సినీ వర్గాల నుంచి దరఖాస్తుల్ని ఆహ్వానించింది.

**గద్దర్ పురస్కారాల ప్రత్యేకత:**

తెలంగాణ సినిమా రంగానికి విశేష సేవలు అందించిన పైడి జయరాజ్, కాంతా రావు పేర్లపై ప్రత్యేక అవార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రముఖ నటుడు ఎం.ప్ర భాకర్ రెడ్డి పేరుపై ఉన్న ప్రజాదరణ పొందిన చలన చిత్రానికి అవార్డును కొనసాగించాలని సర్కార్ డిసైడ్ అయింది.
2014 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం.. సినీ అవార్డులు అందజేయలేదు. ఈ మేరకు 2014 నుంచి ఏడాదికో ఉత్తమ సినిమాకు అవార్డు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు 2014 జూన్ నుంచి 2023 వరకు రిలీజ్ అయిన బెస్ట్ సినిమాలకు అవార్డ్ ఇస్తామని తెలిపింది.

2లో..

## హైడ్రాకు ఫిర్యాదుల వెల్లువ..

### పెండింగ్‌లో 10వేలకు పైగా పిటిషన్లు



**హైదరాబాద్:**
ప్రజావాణి ద్వారా సమస్యల పరిష్కారానికి హైడ్రా చేస్తున్న కృషిని కమిషనర్ రంగనాథ్ వివరించారు. ఒకప్పటి చెరువుల పరిస్థితి, ఇప్పటి పట్టణీకరణ, హైడ్రా చేస్తున్న పనులపై బుధవారం ఆయన ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రజావాణికి నేరుగా వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్‌లో కూడా చాలా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్ రాబోతోందని తెలిపారు. ఎప్పటికప్పుడు ఫిర్యాదుల పరిష్కారం కోసం కృషి చేస్తున్నా.. ఇంకా 10వేలకు పైగా పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు.



## 19న తెలంగాణ బడ్జెట్..

### 27 వరకు అసెంబ్లీ సమావేశాలు

**హైదరాబాద్:**
ఈ నెల 19న తెలంగాణ బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఈమేరకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. 13న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ఉండనుంది. 14న హోలీ సందర్భంగా అసెంబ్లీకి సెలవు ప్రకటించారు.17, 18 తేదీల్లో బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ నెల 27 వరకు బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. 21 నుంచి 26 వరకు పద్దులపై చర్చ ఉండనుంది.

## వైన్‌షాపులు బంద్.. ఎందుకో తెలుసా?



**హైదరాబాద్ :**
మందు బాబులకు బ్యాడ్ న్యూస్. ఈ నెల 14న మద్యం దుకాణాలను మూసివేయనున్నట్లు పోలీస్ శాఖ వెల్లడించింది. రాష్ట్రంలో హోలీ పండుగ సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. దీంతో 14వ తేదీ ఉదయం ఆరుగంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు వైన్ షాపులు మూసి ఉండనున్నాయి.ఈ సందర్భంగా పోలీసులు పలు కీలక సూచలను జారీ చేశారు. శాంతి భద్రతలకు భంగం కలుగకుండా హోలీ షాపులు మూసివేయాలని వైన్స్ నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు. మద్యం సేవించి బహిరంగ ప్రదేశాల్లో గొడవలు సృష్టిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.హోలీ వేడుకల్లో పాల్గొనే వారు ఇతరులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని, బహింగంగా ప్రదేశాల్లో వాహనదారులపై కలర్స్ వేసి ఇబ్బందులకు గురి చేయొద్దని సూచించారు.

## తితిదే అధికారులకు స్పష్టమైన సూచనలివ్వండి!..

### ఏపీ సీఎంకు తెలంగాణ మంత్రి లేఖ



**హైదరాబాద్:**
తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖల అమలు విషయమై తితిదే అధికారులకు స్పష్టమైన సూచనలు ఇవ్వాలని ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విన్నవించారు. ఈ మేరకు మంగళవారం ఆమె లేఖ రాశారు. "తిరుమల వెంకన్న దర్శనం కోసం తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల సిఫార్సు లేఖలను అనుమతించాలని నిర్ణయించడం సంతోషం కలిగించింది. అయితే, తితిదే అధికారులు మీ ఆదేశాలను సరిగ్గా పట్టించుకోవడం లేదు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఈ విషయంలో తితిదేకు సత్వరమే సూచనలు ఇవ్వాలని కోరుతున్నాం" అని చంద్రబాబుకు ఆమె విజ్ఞప్తి చేశారు.

# ఈసీకి జ్ఞానోదయం ఎప్పుడు?




తటస్థతకు తిలోదకాలొదిలి అవకతవకలకు అసలైన చిరునామాగా మారిన ఎన్నికల సంఘం(ఈసీ) సిగ్గుపడాల్సిన విషయమిది. ఆరోపణలొచ్చినప్పుడూ, ఫిర్యాదులందినప్పుడూ మౌనంతోనో, దబాయింపుతోనో తప్పించుకోజూస్తున్న ఈసీపై సోమవారం పార్లమెంటు ఉభయసభలూ దద్దరిల్లాయి. మహారాష్ట్రలో వోటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ ఆరోపణలు చేసి మూణ్ణెల్లవుతోంది. నెల క్రితం కూడా ఆ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ మీడియా సమావేశంలో ఈసీపై అభియోగాలు మోపారు. అయిదు నెలల వ్యవధిలో కొత్తగా 39 లక్షలమంది వోటర్లు ఎలా పుట్టుకొచ్చారని ప్రశ్నించారు. అవి ఆధార రహితం, తప్పుదోవ పట్టించే అభాండాలని చెప్పటం తప్ప నిర్దిష్టంగా ఫలానా చోట ఏం జరిగిందో, వోటర్ల సంఖ్య పెరగటానికి కారణమేమిటో వివరించే ప్రయత్నం ఈసీవైపు నుంచి లేదు! అటు బెంగాల్‌లో ఈ మాదిరి అవకతవకలే బయటపడి ఆ సంస్థ పరువు బజారుపాలు చేశాయి. వోటర్ల జాబితా అవకతవకలతోపాటు నకిలీ వోటరు కార్డులు రాజ్యమేలుతున్నాయని తృణమూల్ ఫిర్యాదు చేస్తే మూడు నెలల్లో సరిచేస్తామన్న జవాబొచ్చింది. వెనువెంటనే దర్యాప్తు చేసి దీనివెనక జరిగిందేమిటో తేల్చిచెప్పడానికి బదులు సరిచేస్తామనటంలో మర్మమేమిటి? అక్కడే కాదు... హరియాణా, గుజరాత్, ఒడిశా, యూపీల్లో సైతం ఇలాగే జరిగిందని విపక్ష సభ్యులు ఆరో పించారు. ఇటీవల ఎన్నికలు జరిగిన ఢిల్లీలోనూ ఇదే తంతు నడిచిందని ఆప్ ఆరోపణ. రాజ్యాంగ సంస్థగా ఎంతో హుందాగా, నియమ నిబంధనలకు లోబడి పనిచేయాల్సిన సంస్థ ఇలా అడుగడు గునా కంతలతో, లోపాయికారీ వ్యవహారాలతో ఎన్నికలు జరిపించటం సిగ్గుచేటు కాదా? ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణ నిష్టగా నిర్వహించాల్సిన క్రతువు. అది కాస్తా ఈమధ్య కాలంలో నవ్వుల పాలవుతున్న వైనం కనబడుతున్నా తనకేం సంబంధం లేనట్టు ఆ సంస్థ ప్రవర్తి స్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో నిరుడు ఎన్నికల సందర్భంగా కేంద్రంలోని అధికార ఎన్డీయే కూటమితో కొత్తగా చుట్టరికం కుదిరిందన్న ఏకైక కారణంతో అప్పటి విపక్ష నాయకులు చెప్పినట్టల్లా అధికారు లను బదిలీలు చేశారు. పర్యవసానంగా ఇతర జిల్లాల్లో జరిగిన దారుణ ఉదంతాల సంగతలా ఉంచి పల్నాడు ప్రాంతం ఎంతటి హింసను చవిచూసిందో, ఎన్ని గ్రామాల ప్రజలు ఇళ్లూ వాకిళ్లూ వదిలి ప్రాణభయంతో పారిపోయారో మీడియా సాక్షిగా వెల్లడైంది. పోలింగ్ కేంద్రాల దురాక్రమణ, తెల్లారుజాము వరకూ పోలింగ్ తంతు కానివ్వటం వంటి అరాచకాలకు అంతులేదు. సాయంత్రం గడువు ముగిసే సమయానికి పోలింగ్ కేంద్రం గేట్లు మూసి ఆ ఆవరణలో ఉన్నవారికి మాత్రమే స్లిప్‌లిచ్చి వోటు వేయటానికి అనుమతించాలని నిబంధనలు చెబుతున్నాయి. క్యూలో చిట్టచివర గేటు దగ్గర ఉన్నవారికి ఒకటో నంబర్ స్లిప్ ఇవ్వటంతో మొదలెట్టి బూత్ సమీపంలో ఉన్నవారికి ఆఖరి స్లిప్ ఇవ్వాలి. ఓటేశాక ఆ స్లిప్‌లు భద్రపరచాలి. సీసీ టీవీ ఫుటేజ్‌లు భద్ర పరచాలి. ఇదంతా జరిగిందా? పోలింగ్ ముగిసిన నాలుగురోజుల తర్వాత 12.5 శాతం వోటింగ్ పెరిగినట్టు చూప టానికి ఈసీ ఏమాత్రం మొహమాట పడలేదు. ఇదంతా ఎక్కడ బయటపడుతుందోనన్న కంగా రుతో పరాజితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించే సమయానికే ఈవీఎంల డేటా ఖాళీ చేశారు. వీవీప్యాట్ స్లిప్‌లు ధ్వంసం చేశారు. ఈవీఎంలలో రికార్డయిన ఓట్ల లెక్కలు బయటకు తీసి, అవి వీవీప్యాట్ స్లిప్‌లతో సరిపోల్చాలని కోరితే డమ్మీ గుర్తులతో కొత్తగా నమూనా వోటింగ్ నిర్వహించ టానికి సిద్ధపడ్డారు! ఇక భద్రపరిచిన ఈవీఎంలలో చార్జింగ్ ఎలా పెరుగుతుందో ఇంతవరకూ చెప్పలేకపోయింది. వీటిపై వైఎస్సార్ కాంగ్రెస్ నిలదీస్తే జవాబివ్వటానికి ఈసీకి నోరు పెగలదు. పార్లమెంటులో ఇంత దుమారం రేగాక డూప్లికేట్ కార్డులపైనా, వోటర్ల జాబితా అవకతవక లపైనా సాధికారికంగా, పద్ధతిగా జవాబివ్వడానికి బదులు వేరే మార్గం ఎంచుకుంది. 'ఈసీ వర్గాలు' అనే పేరుతో ఒక వివరణ బయటికొదిలింది. ఆ సంస్థ తనను తాను ఏమనుకుంటున్నదో గానీ ఇలా మీడియాకు లీకులివ్వటం మర్యాదైన సంగతి కాదు. ఒక పార్టీయో లేదా ప్రభుత్వమో తమ ఆలోచనలపై ప్రజాస్పందనేమిటో తెలుసుకోవటానికి లీకులిస్తుంటాయి. దాని ప్రయోజనం దానికుంటుంది. కానీ ఈసీ అలా చేయటంలో ఆంతర్యమేమిటి? ఉదాహరణకు డూప్లికేట్ వోటర్ కార్డులు వారసత్వపు సమస్యగా తేల్చిచెప్పింది. 2008%-%13 మధ్యే ఈ కార్డులు జారీ అయ్యాయన్నది. అదే నిజమనుకుంటే ఆ సంగతి ఈసీకి ఎప్పుడు తెలిసింది? తెలిశాక తీసుకున్న చర్యలేమిటి? ఇన్నాళ్లూ సరిచేయక పోవటానికి కారణాలేమిటి? అధికారికంగా ఇలాంటి తెలివితక్కువ జవాబు లిస్తే మరిన్ని ప్రశ్నలు వచ్చిపడతాయన్న భయంతోనే ఆ సంస్థ లీకులతో సరిపెట్టింది. ఎంతకాలం ఈ దాగుడుమూతలు? ఎన్నాళ్లు ఈ అవకతవకలు? ఎన్నికల ప్రక్రియపైనా, వివిధ దశల్లో చోటుచేసుకున్న అక్రమాలపైనా ఫిర్యాదులొస్తే నిమ్మకు నీరెత్తినట్టు కూర్చుని ఇప్పుడు పార్లమెంటులో పెద్ద రాద్ధాంతం జరిగాక లీకులివ్వటం, అవి మరిన్ని సందేహాలకు తావీయటం అప్రదిష్ట కాదా? ఇందువల్ల తమ విశ్వసనీయత దెబ్బతింటుందన్న ఇంగితజ్ఞానం కూడా లేదా? ఓడిన రాజకీయ పార్టీలు మాత్రమే కాదు... సాక్షాత్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా పనిచేసిన ఎస్‌వై ఖురేషీ సైతం గతంలోనూ, ఇప్పుడూ కూడా అనేక ప్రశ్నలు లేవనెత్తారు. ఎన్నికల సంఘం తీరు సవ్యంగా లేదన్న అభిప్రాయం ప్రజల్లో బలపడుతున్నదని హెచ్చరించారు. కనుక ఆ సంస్థ ఇప్పటికైనా పారదర్శకతతో వ్యవహరించటం నేర్చుకోవాలి. తప్పును తప్పుగా ఒప్పుకొనే నిజాయితీ ప్రదర్శించాలి. లేనట్టయితే ప్రజానీకం దృష్టిలో దోషిగా మిగలక తప్పదు.

# అసెంబ్లీ సమావేశాలకు విధిగా హాజరు కావాలి

మొదటిపేజీ తరువాయి

సీఎల్పీ భేటీలో మాట్లాడుతుండగా బయటకు వెళ్లిన నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌పై సీఎం అసహనం వ్యక్తం చేశారు. కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. 'చాలామంది సీరియస్ గా పనిచేయట్లేదు. ఒకసారి గెలవడం గొప్పకాదు. మరోసారి అసెంబ్లీకి రావడమే గొప్ప. చాలా మంది బీఆర్ ఎస్ పట్ల సైలెంట్ గా ఉంటున్నారు. అలా చేస్తే మీ మీద అభ్యర్థిని పెట్టరు అనుకుంటున్నారా.. అలా అస్సలు ఊహించుకోకండి. వాళ్ల గురించి నాకు బాగా తెలుసు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత అన్నింటికీ ధైర్యంగా ముందుకెళ్లాలి' అంటూ చెప్పుకొచ్చారు సీఎం రేవంత్.

మీటింగ్ మధ్యలో నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జయవీర్ బయటకు వెళ్లడంపై సీఎం రేవంత్ సీరియస్ అయ్యారు. 'ఓ వైపు నేను ఇంత సీరియస్ గా మాట్లాడుతుంటే అతనేంటి అలా వెళ్తున్నారు. ఇంత నాన్ సీరియస్ గా ఉంటే ఎలా.. మనం మరోసారి గెలవాలంటే చాలా సీరియస్ గా పనిచేయాల్సిందే. రాజకీయాలు అంటే పిల్లలాటలు కాదు. అందరం కలిసి పనిచేస్తేనే మరోసారి మన ప్రభుత్వం వస్తుంది. కొందరి వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు రావొద్దు. ఇక నుంచి అందరూ సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండాలి. వచ్చే నెల 6వ తేదీ నుంచి అన్ని జిల్లాల ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి లంచ్ మీటింగ్ పెట్టుకుందాం. అందరి పనితీరుపై చర్చిద్దాం' అంటూ సీరియస్ గా క్లాస్ తీసుకున్నారు.

# ఏప్రిల్ లో గద్దర్ అవార్డ్స్..

మొదటిపేజీ తరువాయి

అందుకు గురువారం (మార్చి 13) నుంచి హైదరాబాద్ ఏసీగార్డ్స్‌లోని తెలంగాణ చలన చిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో ఫీచర్ ఫిల్మ్స్, జాతీయ సమైక్యతపై సినిమా, బాలల సినిమా, పర్యావరణం/హెరిటేజ్/చరిత్రలపై సినిమా, డెబిట్ ఫీచర్ ఫిల్మ్స్, యానిమేష?న్ ఫిలిం కేటగిరీల్లో అవార్డులు అందజేయనున్నారు. అదేవిధంగా, సోషల్ ఎఫెక్ట్ ఫిల్మ్స్, డాక్యుమెంటరీ ఫిల్మ్స్, షార్ట్ ఫిల్మ్స్, తెలుగు సినిమాలపై బుక్స్ /విశ్లేష ణాత్మకవ్యాసాలు, ఆర్టిస్టులు/టెక్నీషియన్లకు వ్యక్తిగత అవార్డులు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అలాగే ఉర్దూ సినిమా లను ప్రోత్సహించాలని ఉద్దేశ్యంతో ఓ అవార్డు ఇవ్వబోతున్నట్లు తెలిపారు. ఇక వచ్చే నెల (ఏప్రిల్) చివర్లో ఈ పురస్కారాలు అందించేందుకు ప్రభుత్వం భావిస్తోంది.

# దొంగలు కాదు..ఘరానా దొంగ పన్నాగం

- వ్యాపారి ఇంట్లో చోరీకి మరో వ్యాపారి ప్లాన్
- కూపీలాగడంతో వ్యవహారం బట్టబయలు

చిత్తూరులో కాల్పుల ఘటనలో కీలక మలుపు చోటు చేసుకుంది. ఓ ప్రముఖ వ్యాపారి ఇంట్లో మరో ప్రముఖ వ్యాపారి దోపిడీకి పన్నాగం పన్నినట్లు పోలీసులు గుర్తించారు. చిత్తూరులోని గాంధీరోడ్డులో ఉదయం కాల్పులు కలకలం సృష్టించాయి. లక్ష్మి సినిమా హాల్ సమీపంలో ఉన్న పుష్ప కిడ్స్ వరల్డ్ యజమాని చంద్రశేఖర్ ఇంట్లోకి దొంగల ముఠా చొరబడింది. రెండు తుపాకులతో వారు గాల్లోకి కాల్పులు జరిపారు. యజమాని అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడికి చేరుకుని ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. తుపాకులు, బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో యజమాని చంద్రశేఖర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. చంద్రశేఖర్ ఇంట్లో దోపిడీకి ఎస్‌ఎల్‌వీ ఫర్నీచర్ యజమాని ముఠాను ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. కర్ణాటక, ఉత్తారాదికి చెందిన దుండగులు ఈ ముఠాలో సభ్యులుగా ఉన్నారు. రబ్బర్ బు÷-లలెట్లు వినియోగించే తుపాకులతో ఇంట్లో దోపిడీకి యత్నించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు..
రెండున్నర గంటల పాటు ఆపరేషన్ నిర్వహించారు. దొంగల ముఠాను అదుపులోకి తీసుకున్నారు.

# బస్సులు ఢీకొన్నప్రమాదంలో ఇద్దరు మృతి

**మంత్రి జనార్దన్ రెడ్డి దిగ్భ్రాంతి**

అన్నమయ్య జిల్లా రాయల్పాడు సమీపంలో రెండు ప్రైవేటు బస్సులు ఢీకొని ఇద్దరు మృతి చెందడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన అన్నమయ్య జిల్లా ఇన్చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిప్రమాదంలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండటం.. 40 మందికి తీవ్ర గాయాలు కావడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన మంత్రిక్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని వైద్యాధికారులకు సూచించిన మంత్రి ప్రమాద ఘటనపై జిల్లా అధికారులను ఆరా తీసిన మంత్రిఇటువంటి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు.

# మహిళాసాధికారిత టీడీపి పేటెంట్

- ఎన్టీఆర్ నుంచే మహిళా సంక్షేమానికి పెద్దపీట
- విద్యాఉద్యోగాల్లో 33శాతం రిర్వేషన్లు మా ఘనతే
- తల్లికి, చెల్లికి ఆస్తులను పంచి ఇవ్వని వ్యక్తి పాలన చేశాడు
- డీలిమిటేషన్‌తో 75మంది మహిళలకు అసెంబ్లీలో చోటు
- మహిళా సాధికారతపై అసెంబ్లీలో సిఎంచంద్రబాబు

తమ ప్రభుత్వంలో ఏ కార్యక్రమం చేపట్టినా మహిళలను దృష్టిలో పెట్టుకునే చేశామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. శాసనసభలో మహిళా సాధికారితపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. ఓవైపు మహిళా దినోత్సవం జరుపుకుంటున్న సమయంలోనే మహిళల పట్ల వివక్షత చూపడం జరుగుతోందన్నారు. ఎన్టీఆర్ టీడీపీ పెట్టినప్పటి నుంచి ఉమెన్ ఎంపవర్‌మెంట్‌కు కృషి చేశారని గుర్తుచేశారు. మహిళా సాధికారిత కోసం నిన్న, నేడు, రేపు టీడీపీ పనిచేస్తుందని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం జండర్ ఈక్విటీ ద్వారా ఆడవారికి సమాన అవకాశాలు కల్పించడమని తెలిపారు. మహిళా సాధికారతను మాటల్లో చెప్పడం కాదని.. చేతల్లో చేసి చూపించాలన్నారు. తెదేపాతోనే మహిళా సాధికారత ప్రారంభమైందని చెప్పారు. మహిళలకు ఆస్తిలో హక్కును తొలిసారి ఎన్టీఆర్ కల్పించారని గుర్తుచేశారు. 'తల్లి, చెల్లికి ఆస్తిలో వాటా ఇవ్వని వ్యక్తి గతంలో సీఎంగా ఉన్నారు. ఇచ్చిన ఆస్తిని కూడా వెనక్కి తీసుకునేందుకు కోర్టుకు వెళ్లారు. ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన వ్యక్తే.. తల్లి, చెల్లికి ఆస్తిలో వాటా ఇవ్వలేదు.

# అన్నదాన సత్రం కూల్చడం అన్యాయం: లోకేశ్

బద్వేలు నియోజకవర్గంలో అన్నదాన సత్రాన్ని కూల్చడం బాధాకరమని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కాశీనాయన అన్నదాన సత్రం కూల్చివేతపై ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. అటవీ నిబంధనల పేరిట కూల్చడం సరికాదన్నారు. భక్తుల మనోభావాలు గౌరవించి.. కూల్చకుండా ఉండాల్సిందని పేర్కొన్నారు. దీనికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. సొంత నిధులతో అదే స్థలంలో అన్నదాన సత్రం పునర్నిర్మిస్తామని లోకేశ్ చెప్పారు

# తొందరగా పిల్లలను కనండి

## పెళ్లయిన జంటకు ఉదయనిధి సూచన

లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన విషయంలో తమిళనాడు గత కొంతకాలంగా కేంద్రంపై విమర్శలు గుప్పిస్తోన్న సంగతి తెలిసిందే. జనాభా ప్రాతిపదికన మాత్రమే నియోజకవర్గాలను నిర్ణయిస్తే, రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు తగ్గుతాయని అక్కడి నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా ఉదయనిధి 72 మంది జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్తగా పెళ్లయిన జంటలు అత్యవసరంగా పిల్లల్ని కనాలని కోరారు. అయితే ఎక్కువ మందిని మాత్రం కనొద్దని సూచించారు. ' 2026 తర్వాత అమల్లోకి వచ్చే ఈ డీలిమిటేషన్ పక్రియ జనాభా ఆధారంగా పార్లమెంటరీ నియోజకవర్గాలను తిరిగి రూపొందిస్తుంది.
రాష్ట్రాల్లోని జనాభాకు సరైన ప్రాతినిధ్యం లభించేలా పార్లమెంటులో , అసెంబ్లీల్లో సీట్లుండేలా చూసే పక్రియలో ఎక్కువ సీట్లు ఇవ్వాలంటే , కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు జనాభా సంఖ్యను పర్యవేక్షిస్తోంది. తమిళనాడుతోసహా దక్షిణాది రాష్ట్రాలు దశాబ్దాలుగా జననాల రేటును నియంత్రిస్తూ వస్తున్నాయని, దీని మూలంగా పార్లమెంటరీ ప్రాతినిధ్యంలో వాటి వాటా తగ్గే అవకాశం ఉంది ' అని స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తమిళనాడు నుంచి 39 మంది ఎంపీలు ఉన్నారని, రాష్ట్ర జనాభబూ 7 కోట్లు కాబట్టి , డీలిమిటేషన్ పక్రియ అమల్లోకి వస్తే ఆ సంఖ్య 31 కి తగ్గుతుందని ఆయన అన్నారు. అయితే ఎక్కువ జనాభా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలు మాత్రం 100 కు పైగా సీట్లు పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీని ప్రకారం చూస్తే రాష్ట్ర జనాభా కూడా అధికంగా ఉండాలని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# భారత్-పాక్ సరిహద్దుల్లో విద్యుత్ ప్రాజెక్టు

## సభలో చర్చ..ప్రభుత్వ తీరుకు నిరసనగా వాకౌట్

భారత్, పాకిస్తాన్ సరిహద్దుకు చేరువలో పునరుపయోగ విద్యుత్ ప్రాజెక్టుకు అనుమతి మంజూరుపై బుధవారం లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యులు, ముఖ్యంగా కాంగ్రెస్, డిఎంకె సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి 'సంతృప్తికర సమాధానం రాకపోవడంతో' వారు ఆతరువాత సభలో నుంచి వాకౌట్ చేశారు. కాంగ్రెస్ సభ్యుడు మనీష్ తివారీ ప్రశ్నోత్తరాల సమయంలో ఒక అనుబంధ ప్రశ్న అడుగుతూ, జాతీయ భద్రత, ఇంధనశక్తి భద్రత కలసి సాగవలసి ఉంటుందని అన్నారు. పునరుపయోగ విద్యుత్ ప్రాజెక్టు అంతర్జాతీయ సరిహద్దు (ఐబి)కి ఒక కిలోమీటర్ సమీపం వరకు ఏర్పాటు అవుతుందని ఆయన చెప్పారు. భద్రత ప్రొటోకాల్ ప్రకారం, ఏ భారీ మౌలికవసతుల కల్పన ప్రాజెక్టు అయినా ఐబికి కనీసం పది కిలోమీటర్ల దూరంలో ఉండాలని ఆయన అన్నారు. ప్రతిపాదిత ప్రాజెక్టుకు ఏ సడలింపు అయినా మంజూరు చేశారా అని తివారీ అడిగారు. ఏ ప్రతిపాదనకైనా అనుమతులు, లైసెన్సులు కేంద్రం, రాష్ట్రం, సంబంధిత ఏజెన్సీల నుంచి ఆమోదం పొందిన తరువాతే మంజూరు అవుతుంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశంలో పునరుపయోగ విద్యుత్ ఉత్పత్తి పట్ల ప్రభుత్వం ఆసక్తితో ఉందని నూతన, పునరుపయోగ విద్యుత్ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలియజేశారు. లైసెన్సుల జారీకి, అనుమతి మంజూరుకు ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సంబంధిత ఏజెన్సీల నుంచి ఆమోదముద్ర కోరినట్లు మంత్రి తెలిపారు. మంత్రి సమాధానంతో సంతృప్తి చెందని కాంగ్రెస్ సభ్యులు జాతీయ భద్రతపై నినాదాలు చేసి, సభ మధ్యంలోకి దూసుకుపోయారు. వారు డిఎంకె సభ్యులతో పాటు ఆతరువాత వాకౌట్ చేశారు.

# గవర్నర్ ప్రసంగం అంటే గౌరవం లేదా

- బిఆర్ఎస్ నేతల తీరు దుర్మార్గం
- మండిపడ్డ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

వర్నర్ ప్రసంగాన్ని అవహేళన చేయడం తగదని, కనీసం గవర్నర్ ప్రసంగాన్ని గౌరవించే సంస్కృతి కూడా బీఆర్ఎస్ నేతలకు లేకుండా పోయిందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ, బీఆర్ఎస్ నేతల తీరును తీవ్రంగా విమర్శించారు. గబీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై విమర్శలు చేయడానికి ముందుగా అసెంబ్లీకి హాజరై సలహాలు, సూచనలు ఇవ్వాలని ప్రభుత్వ విప్ సూచించారు. ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను పట్టించుకోవడం లేదని, వారు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని ఆయన పేర్కొన్నారు. ప్రజలు వారి తీరును గమనిస్తున్నారని, విపక్షంగా వారు సరిగ్గా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారని ఐలయ్య పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ, కులగణన వంటి కీలక నిర్ణయాలతో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అయితే, ఈ కులగణనలో కల్వకుంట్ల కుటుంబ సభ్యులు పాల్గొనకపోవడం దుర్మార్గమన్నారు. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపిస్తూ, కాళేశ్వరం ప్రాజెక్టు పేరు మీద భారీగా కమిషన్లు దండుకున్నారని బీర్ల ఐలయ్య విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా పాలన సాగిస్తుందని, గత 10 ఏళ్ల పాలనలో బీఆర్ఎస్ మిగిల్చిన అప్పులను తగ్గించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్లు రుణమాఫీ చేసినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం 10 ఏళ్లలో లక్ష రూపాయలు కూడా రుణమాఫీ చేయలేదని విమర్శించారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, కొత్త పథకాలను రూపొందిస్తున్నామని తెలిపారు. తెలంగాణ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చినట్లు బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. పింక్ పార్టీ సోషల్ మీడియా తప్పుడు ప్రచారాన్ని ఆపాలని, రేవంత్ రెడ్డి తీసుకుంటున్న అభివృద్ధి చర్యలను అడ్డుకోవడం బీఆర్ఎస్ ఆలోచనగా మారిందని అన్నారు.

## మహిళా ఉద్యోగులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి : కలెక్టర్ పమేలాసత్పతి



కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి

ఇంటి పనులతో పాటు ఉద్యోగ బాధ్యతల్లో కీలకపాత్ర పోషిస్తున్న మహిళా ఉద్యోగులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం సిటీలో టీఎన్జీఓ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ దారం శ్రీనివాస్ రెడ్డితో కలిసి కలెక్టర్ పమేలాసత్పతి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు తమ కుటుంబ పనులతో పాటు ఉద్యోగ జీవితంలో తీరిక లేకుండా ఉంటారని, కచ్చితంగా 6 నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇటీవల పెద్దపల్లిలో ఇంటర్నేషనల్ షావొలిన్ కుంగ్ ఫూ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి టోర్నమెంట్ లో గోల్డ్ మెడల్ సాధించిన గంగాధర మండలం, ఒడ్యారం జడ్పీహైస్కూల్ స్టూడెంట్ తపస్వినిని కలెక్టర్ అభినందించారు. అనంతరం వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ పోస్టర్ ను ఎస్ఆర్ఆర్ అటానమస్ గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజి ప్రిన్సిపల్ రామకృష్ణతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీజీఓ ప్రెసిడెంట్ కాళీచరణ్?,సెక్రటరీ రవీందర్ రెడ్డి, టీఎన్జీఓ సెక్రటరి సంగెం లక్ష్మణ్? రావు, వెలిచాల సుమంత్ రావు, ముప్పిడి కిరణ్ రెడ్డి, డీడబ్ల్యూఓ సబిత, ఎంఇఓ ప్రభాకర్ రావు, డా.అర్జున్,తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క బిడ్డా పుట్టలేదు..




కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి

- గాంధీలో ఐవీఎఫ్ సేవలకు కాసుల కొరత
- ప్రస్తుతం ఐయూఐ సేవలకే పరిమితం
- వంద జంటలకు తప్పని నిరీక్షణ
- గాంధీలో అధునాతన ఐవీఎఫ్ కేంద్రం

గాంధీ ఆసుపత్రి, న్యూస్‌టుడే: ప్రైవేటుకు దీటుగా రూ.లక్షలు పెట్టి అందుబాటులోకి తెచ్చిన కృత్రిమ గర్భధారణ సేవలు (ఐవీఎఫ్) పడకేశాయి. నిధుల కొరత కారణంగా ఇప్పటివరకు ఒక్క జంటకు కూడా ఈ సేవలను అందించలేకపోయారు. ఐవీఎఫ్ సేవలకు కార్పొరేట్, ప్రైవేటు సెంటర్లు రూ.లక్షలు వసూలు చేస్తున్నాయి. పేదలకు ఇది ఆర్థిక భారమే. ఇలాంటి వారి కోసం పైసా ఖర్చు లేకుండా సంతాన సాఫల్యాన్ని కల్పించేందుకు ప్రభుత్వం గతంలో రూ.కోట్లతో గాంధీ ఆస్పత్రితోపాటు పేట్లబుర్జు, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రుల్లో ఇన్ విట్రో ఫెర్టిలిటీ(ఐవీఎఫ్) సెంటర్లను ఏర్పాటు చేసింది. ఇటీవల వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి దామోదర రాజనర్సింహ గాంధీ ఆసుపత్రిని సందర్శించి తక్షణమే ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. నిధుల కొరతతో ఐవీఎఫ్ సేవలు సాగడం లేదు. ఇలా 100 జంటల వరకు ఎదురు చూస్తున్నట్లు తెలుస్తోంది.

### ఆధునిక ల్యాబ్ వసతి...

గాంధీ ఎంసీహెచ్ భవనం ఐదో అంతస్తులో ఐవీఎఫ్ సెంటర్‌ను అధునాతన పరికరాలు, అత్యంత సౌకర్యవంతమైన వసతులతో కార్పొరేట్‌కు దీటుగా రూపొందించారు. కోజికోడ్, తిరువనంతపురంతోపాటు దేశంలోని పలు ఫెర్టిలిటీ సెంటర్లను పరిశీలించి దీన్ని తీర్చిదిద్దారు. ఎంబ్రియాలజీ ల్యాబ్, ఐవీఎఫ్ ఆపరేషన్ థియేటర్, ఆంబ్రాలజీ ల్యాబ్‌లతోపాటు ఫలదీకరణ చేసేందుకు అవసరమైన ఆధునిక ఎక్విప్‌మెంట్, సెమన్ ఎనాలసిస్ యంత్రాలు, రీఏజెంట్స్ (ద్రావకాలు) డయాగ్నోస్టిక్ హిస్టరీ లాప్రోస్కోపీ, అల్ట్రాసౌండ్, కంట్రోల్ వేరియంట్, హైపర్ స్టిమిలేషన్ (సీఓఏ)లను సమకూర్చారు. గాంధీలో కేవలం ఇంట్రా యుటెరిన్ ఇన్‌సెమినేషన్ (ఐయూఐ) మాత్రమే చేస్తున్నారు. వీర్యాన్ని ల్యాబ్‌లో శుద్ధి చేసి భార్య గర్భాశయం వద్ద నేరుగా ప్రవేశపెడతారు. ఐవీఎఫ్‌తో పోల్చితే ఇది తేలికైన విధానం.

### ముందుకు సాగని ప్రక్రియ..

ఐవీఎఫ్ ప్రక్రియ చాలా క్లిష్టంగా ఉంటుంది. మహిళ నుంచి అండాలను సేకరించి వాటిని ల్యాబ్‌లో ఫలదీకరణ చేయాలి. ఇందుకోసం అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఐవీఎఫ్ కోసం కల్చర్ మీడియంలు, మందులు, డిస్పోజబుల్ కేథటార్లు ఇతర సామగ్రి సమకూర్చుకోవాలి. ఇందుకు ఒక్కో ఐవీఎఫ్‌కు కనీసం రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు అవసరం. వీటికి సంబంధించి టెండర్లు ముందుకు సాగకపోవడంతో నిరీక్షణ తప్పడం లేదు. సెమన్ ఎనాలసిస్ చేసి అండాన్ని బతికించి ఈ రెండింటిని కలిపి ఎంబ్రియాలజీ ల్యాబ్‌లో అనుకూలమైన వాతావరణ పరిస్థితుల మధ్య కనీసం 6 రోజులు ఉంచిన తర్వాత పిండాన్ని మహిళ గర్భాశయంలో ప్రవేశ పెడతారు. గాంధీలో లెవల్-2 కేసులు మాత్రమే చేసే సౌలభ్యం ఉంది. దాతల నుంచి సేకరించి చేసే ఐవీఎఫ్ లెవల్-3 సేవలు అందుబాటులో లేవు. లెవల్-2 సేవలు ప్రారంభం కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని సంతాన భాగ్యం కోసం ఎదురు చూస్తున్న జంటలు కోరుతున్నాయి.

# జర్నలిస్టుల ఆరోగ్య పథకంపై త్వరలో సమావేశం

- టీయూడబ్ల్యూజే ప్రతినిధి...
- బృందానికి మంత్రి దామోదర్ హామీ...





కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిది

రాష్ట్రంలో జర్నలిస్టులకు,వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పథకాన్ని పగడ్బందీగా అమలు చేసేందుకుగాను త్వరలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహిస్తామని రాష్ట్ర వైద్య,ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సి.దామోదర్ రాజ నరసింహా హామీ ఇచ్చారు.బుధవారం నాడు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో ప్రతినిధి బృందం అసెంబ్లీలోని ఛాంబర్ లో మంత్రి దామోదర్ రాజ నర్సింహాను కలిసి జర్నలిస్టుల ఆరోగ్య పథకం అమలుపై చర్చించింది.అంతేకాకుండా వినతి పత్రాన్ని అందించింది.ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ,గత ఐదేళ్లుగా రాష్ట్రంలో జర్నలిస్టుల ఆరోగ్య పథకం అమలుకాక పోవడంతో జర్నలిస్టులు అనుభవిస్తున్న కష్టాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.అసలే ఆర్థిక కష్టాలతో జీవితాలు కొనసాగిస్తున్న జర్నలిస్టులకు,వైద్య ఖర్చులు మరింత భారంగా మారాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.అప్పులు చేసి జర్నలిస్టులు వైద్యం పొందే పరిస్థితి నెలకొందని ఆయన అన్నారు.దీనిపై స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహా మాట్లాడుతూ,జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రత్యేక కృషి చేస్తానని హామీ ఇచ్చారు.మంత్రిని కలిసిన టీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్లూరి రాములు,రాష్ట్ర కార్యదర్శి వరకాల యాదగిరి,ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యుడు రజనీకాంత్ తో పాటు పలువురు సీనియర్ జర్నలిస్టులు ఉన్నారు.

## జిల్లా ఎస్పీ స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేసిన డి.ఎస్.పి సత్యనారాయణ

కరపత్రం బాన్సువాడ మార్చి 12



బాన్సువాడ పట్టణంలోని డిఎస్పి కార్యాలయానికి ఎస్పి రాజేష్ చంద్ర ఉద్యోగ బాధ్యతలు చేపట్టి మొదటిసారి వచ్చిన సందర్భంగా డిఎస్పి సత్యనారాయణ పూల మొక్క అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ డివిజన్ లోని పలు అంశాలకు సంబంధించిన వివరాలను డీఎస్పీ సత్యనారాయణ ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హరిహర దేవి దేవాలయ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న పోచారం

కరపత్రం బాన్సువాడ మార్చి 12



బాన్సువాడ మండలంలోని బుడిమి గ్రామ శివారులో మంజీర నూతనంగా నిర్మించే దేవి క్షేత్రం దేవాలయం భూమి పూజ కార్యక్రమానికి గురు మదనానంద సరస్వతి, మాధవ నంద సరస్వతి స్వామి పర్యవేక్షణలో బుధవారం రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు మహిళలు పాల్గొన్నారు.

## రైతులకు మెరుగైన విద్యుత్ అందించేందుకు కృషి.... డిఈ గంగాధర్



కరపత్రం బాన్సువాడ మార్చి 12

రైతులకు మెరుగైన నాణ్యమైన విద్యుత్ను అందించేందుకు కృషి చేస్తున్నామని అందులో భాగంగా పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిఈ గంగాధర్ అన్నారు. బాన్సువాడ మండలంలోని తాడ్కోల్ గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఈ గంగాధర్ మాట్లాడుతూ పొలం బాట కార్యక్రమంలో భాగంగా పంట పొలాల్లో వంగిన ,విరిగిన, నేలకోరిగిన విద్యుత్ స్తంభాలను గుర్తించి విద్యుత్ తీగలను సరిచేస్తామన్నారు. నాణ్యమైన విద్యుత్ ను అందించేందుకు అనునిత్యం కృషి చేస్తామని రైతులు విద్యుత్ అధికారులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ ప్రభాకర్,, ఏఈ అనిల్ కుమార్, లైన్మెన్, విద్యుత్ సిబ్బంది,రైతులు తదితరులు పాల్గొన్నారు.
6

# రిజిస్ట్రేషన్‌కు వచ్చే ప్రతి ప్లాట్‌కు ఎల్ఆర్ఎస్

తిప్పిరి గంగాధర్,కరపత్రం ప్రతినిధి



ప్లాట్ల క్రయవిక్రయాల కోసం రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చే సమయంలోనే లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్) కింద రుసుము వసూలు చేయనున్నారు. చాలామంది ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోకపోవడంతో వారినుంచి ఈ విధంగా వసూలు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

అనుమతిలేకుండా వెలుస్తున్న అనధికారిక లేఅవుట్లతో ఇటు ప్రభుత్వానికి ఆదాయపరంగా నష్టం ఏర్పడటంతోపాటు భవిష్యత్తులో అక్కడ నిర్మాణాలు జరిగితే మౌలిక వసతుల కల్పన భారం అవుతోంది. ప్లాట్లు చేసిన యజమానులు మాత్రం సౌకర్యాలు కల్పించకుండా లాభం పొందుతున్నారు. ఈ నష్టాలను నివారించేలా గత భారాస ప్రభుత్వ హయాంలోనే 2020 ఆగస్టు 26న కొత్త ప్లాట్లకు(అక్రమ లేఅవుట్లకు) రిజిస్ట్రేషన్లను నిలిపివేసింది. ప్లాటుకు ఏదైనా లింకు డాక్యుమెంట్ ఉంటేనే అంటే ఒకసారి విక్రయించి ఉంటే రిజిస్ట్రేషన్లకు అనుమతిచ్చింది. ఇదే సమయంలో అక్రమ ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్ రావడంతో చాలామంది దరఖాస్తు చేసుకున్నారు. మరోపక్క ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోని వారు సైతం చాలా మందే ఉన్నారు. అలా దరఖాస్తు చేసుకోకుండా ప్లాట్ల క్రయవిక్రయాల కోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన సమయంలో ఎల్ఆర్ఎస్ రూపేణా డబ్బులు వసూలు చేయనున్నారు. 2020 కంటే ముందు అక్రమ లేవుట్‌లో 10శాతం రిజిస్ట్రేషన్ అయి ఉంటే మిగిలిన ప్లాట్లకు తాజాగా రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించడంతో ఆ ప్లాట్ల ద్వారా స్టాంపు రుసుము, మరోపక్క ఎల్ఆర్ఎస్ రూపేణా రెండు రకాలుగా ఆదాయం సమకూరనుంది.

### అధికారులు ఆమోదిస్తేనే

దరఖాస్తు చేసుకోగానే రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి ఇటు మున్సిపాల్టీ, ఇటు గ్రామపంచాయతీ కార్యాలయానికి నేరుగా ప్లాట్ల వివరాలు వెళ్తాయి. ఆ ప్లాటుకు ఎల్ఆర్ఎస్ చేయవచ్చో లేదో అనేది సంబంధిత అధికారులు నిర్ణయిస్తారు.

క్షేత్రస్థాయిలో ఎల్1, ఆ తరువాత ఎల్2, ఎల్3 స్థాయిలో అధికారులు పరిశీలన చేసి ఆమోదించాకే రిజిస్ట్రేషన్ కార్యాలయ లాగిన్‌కు తిరిగి పంపిస్తారు. అప్పుడే ఆ ప్లాటుకు ఎల్ఆర్ఎస్ వర్తిస్తుంది. ఎల్ఆర్ఎస్ రుసుము మాత్రం మున్సిపాల్టీ, పంచాయతీల ఖాతాలోనే జమవుతాయి. ఒకవేళ ఎల్ఆర్ఎస్ తిరస్కరిస్తే ప్లాటు యజమాని ముందుగా చెల్లించిన రుసుములో 10 శాతం ఛార్జీల కింద తీసుకొని మిగతాది దరఖాస్తుదారులకు చెల్లిస్తారు.

# జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటాం

**-టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య**
**-ఖమ్మంలో సభ్యత్వ నమోదు**
**-వివిధ సంఘాల నుంచి భారీగా చేరికలు**







**కరపత్రం ప్రతినిధి ఖమ్మం జిల్లా**
రాష్ట్రంలో జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య హామీ ఇచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఉన్న ఒకే ఒక్క జర్నలిస్టు యూనియన్ లో కొనసాగిన నియంత పోకడలను వ్యతిరేకిస్తూ 2006లో ఫెడరేషన్ ఆవిర్భవించిందని, ఆనాటి నుంచి నేటి వరకు టీడబ్ల్యూజేఎఫ్ చేస్తున్న పోరాటాలకు జర్నలిస్టులు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం పట్టణంలో నిర్వహించిన ఫెడరేషన్ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభించింది.
ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ..జర్నలిస్టుల ప్రతి సమస్యపై నికరంగా పోరాడేది ఒక్క టీడబ్ల్యూజేఎఫ్ మాత్రమే అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బలమైన జర్నలిస్టు సంఘంగా టీడబ్ల్యూజేఎఫ్ బలపడిందని, రాబోయే రోజుల్లో వివిధ యూనియన్ల నుంచి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు ఫెడరేషన్ లో చేరుతారని అన్నారు. ఖమ్మంలో ఇంత భారీ సంఖ్యలో జర్నలిస్టులు టీడబ్ల్యూజేఎఫ్ లో చేరటం హర్షనీయమని మామిడి సోమయ్య పేర్కొన్నారు.
టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపునయ్య మాట్లాడుతూ..ఓ రెండు జర్నలిస్ట్ యూనియన్లు రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే వారికి వత్తాసు కొడుతూ.. జర్నలిస్టుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని ఆరోపించారు. నాయకులుగా లబ్ధి పొందుతూ.. జర్నలిస్టుల సమస్యలపై స్పందించకుండా... నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నారని తెలిపారు. నిరంకుశ విధానాలను వ్యతిరేకిస్తూ జర్నలిస్టుల సమస్యలపై నికరంగా పోరాడే టీడబ్ల్యూజేఎఫ్ ను ఆశ్రయిస్తున్నారని చెప్పారు. కొందరు నాటి, నేటి ప్రభుత్వంలో జర్నలిస్టుల సమస్యలను గాలికి వదిలి ప్రభుత్వాల వద్ద సైంధవుల పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. యూనియన్ నిర్మాణపరమైన అంశాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఇంత భారీగా తరలివచ్చి సభ్యులుగా చేరిన ప్రతి ఒక్క జర్నలిస్టుకూ టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.
ఖమ్మంలో కదం తొక్కిన జర్నలిస్టులు
దాదాపు 300 మందికి పైగా జర్నలిస్టులు తరలివచ్చి సభ్యత్వాలు నమోదు చేయించుకున్నారు. వివిధ జర్నలిస్టు యూనియన్ ల నుంచి టీడబ్ల్యూజేఎఫ్ లో పెద్ద సంఖ్యలో పాత్రికేయులు చేరారు. దీనికి ముందు ఖమ్మంలోని కాల్వొడ్డు జూబ్లీ క్లబ్ నుంచి రోటరీ నగర్ లోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్ వరకు పెద్ద ఎత్తున మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అక్కడి నుంచి పాత బస్టాండ్ సెంటర్ మీదుగా జడ్పీ సెంటర్ కు ర్యాలీ చేరుకుంది. అక్కడున్న అంబేద్కర్ విగ్రహానికి జర్నలిస్టులు నివాళి అర్పించారు. తిరిగి ప్రారంభమైన మోటార్ బైక్ ర్యాలీ ఇల్లందు క్రాస్ రోడ్ మీదుగా రోటరీ నగర్ లోని సభాస్థలికి చేరుకుంది. అనంతరం ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పల్లా కొండలరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో రాష్ట్ర అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు రాజశేఖర్, జాతీయ నాయకులు ఆనందం, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయ్ కుమార్, గుడిగ రఘు, కోశాధికారి ఆర్ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్,జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, టీడబ్ల్యూజేఎఫ్ లో నూతనంగా చేరిన సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్, ఆవుల శ్రీనివాస్, ఎగినాటి మాధవరావు, మానుకొండ రవి కిరణ్, కొత్త యాకేష్, కూరాకుల గోపీ, జానీపాష, తాళ్ళూరి రమేష్, పెండ్ర అంజయ్య, రాంపుడి నాగేశ్వరరావు, కొమెర వెంకటేశ్వర్లు, మధుశ్రీ, సంజీవరావు, సుభానీ, మాధవరావు, అయ్యప్ప తదితరులు ప్రసంగించారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి..



**- జమ్మికుంట సీఐ వర గంటి రవి**
**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 12**




వరల్డ్ యాంటీ స్మోకింగ్ డే సందర్భంగా జమ్మికుంట పట్టణ సిఐ వరగంటి రవి మీడియాతో మాట్లాడుతూ సిగరెట్ తాగే అలవాటు వల్ల అనేక ప్రాణాంతకమైన వ్యాధుల పాలు అయ్యే అవకాశం ఉన్నందున వాటికి దూరంగా ఉండాలని ముఖ్యంగా యువత సిగరెట్లకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. స్నేహితులతో సరదాగా ప్రారంభమై వ్యసనంగా మారి జీవితాలను నాశనం అయ్యే స్థితికి మత్తు పదార్థాలు చేరుస్తాయని కాబట్టి వాటికి దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పిల్లల ప్రవర్తన పట్ల దృష్టి పెట్టాలని అన్నారు. సిగరెట్ అలవాటు అయిన వారికి గంజాయి లాంటి రకరకాల మత్తు పదార్థాలకు ఎడిక్ట్ అయ్యే అవకాశాలుంటాయి కాబట్టి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలు ఎవరు వినియోగించినా, సరఫరా చేసిన కఠిన చర్యలు తప్పవని అన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబుని విమర్శిస్తే ఊరుకోము

**– రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు**

**కరపత్రం రామగిరి ప్రతినిధి, మార్చ్ 12.**
బుధవారం రోజు స్థానిక శ్రీపాద భవన్ ఐఎన్టియుసి ఆఫీసులో రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సంద్భంగా నాయకులు మాట్లాడుతూ...మంగళవారం కొంతమంది రామగిరి మండలంలోని టిఆర్ఎస్ నాయకులు మంత్రి శ్రీధర్ బాబుని ఉద్దేశించి మాట్లాడడం వారి అర్థం లేని ఆరోపణలని బుధవారం కాంగ్రెస్ పార్టీ పరంగా తీవ్రంగా ఖండిస్తున్నాం.శ్రీధర్ బాబు గెలిచిన వెంటనే ఈ ప్రాంతంలో ఇసుక రవాణాను ఆపాలని ప్రయత్నం చేస్తే అప్పుడు టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన ఇసుక క్వారీల లీజు ఓనర్లు కాంట్రాక్టర్లు కోర్టుకు వెళ్లి స్టే తీసుక రావడం నిజం కాదా,ఆ స్టే తీసుకురావడంలో అందులో ఉన్న అప్పటి టిఆర్ఎస్ అధికార పార్టీ నాయకులు ప్రమేయం లేదా,కోర్టుకు వెళ్లి స్టే తీసుకోవడం నిజమా కాదా,దీనికి సమాధానం చెప్పండి.ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో ఆనాడు ఇసుక పాలసీలు తీసుకువచ్చి,ఈ ప్రాంతంలో అక్రమ ఇసుక రవాణా చేసి ఎంతో మంది ప్రాణాలు పోవడానికి ఎంతో మంది కాళ్లు చేతులు పోయి మంచానికే పరిమితం కావడానికి కారణం ఆనాటి టిఆర్ఎస్ (బిఆర్ఎస్) ఆ పార్టీ నాయకులు కాదా,అప్పుడు జరుగుతున్న అక్రమ ఇసుక రవాణా ఓవర్ లోడ్ ఇసుక వల్ల రోడ్లు డ్యామేజ్ అయి ఒకే వే బిల్లుమీద దొంగతనంగా వేలకొద్ది అక్రమ ఇసుక రవాణా అరికడతానని మాట ఇచ్చాడు.ఆ మాట ప్రకారమే అక్రమంగా జరిగే ఇసుక రవాణాను అడ్డుకట్ట వేశాడు ఓవర్లోడ్ బండ్లను అరికట్టారు.రోడ్లు డ్యామేజ్ కాకుండా అరికట్టాడు.కొంతమంది రామగిరి టిఆర్ఎస్ నాయకులు మంత్రి పై విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదు ఇసుక అక్రమ రవాణాలను అరికట్టిందే మంత్రి శ్రీధర్ బాబు గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా



దోపిడీ జరిగి అదనపు బకెట్లతో ఒకవైపు అధికారులు కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి తీరని నష్టం తీసుకొచ్చినారు ఇప్పుడు అదనపు బకెట్ లేకుండా ప్రభుత్వాన్ని ఆదాయము గండి కొట్టకుండా చర్యలు తీసుకున్నారు.స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినారు అది అర్థం చేసుకొని మాట్లాడాలి.తెలంగాణ ఏర్పడినప్పుడు మిగులు బడ్జెట్ తో ఉన్న తెలంగాణ రాష్ట్రం మీ ప్రభుత్వ హయాంలో ఏడు లక్షల కోట్ల అప్పు చేసి వదిలిపెట్టి పోయారు.రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అదే వచ్చే లిక్కర్ రెండు సంవత్సరాల పాలసీ ఉండగా ఆరు నెలల ముందు టెండర్లకు పిలిచి వాటికి వచ్చిన ఆదాయాన్ని మింగిన ఘనత మీ ప్రభుత్వానిది కాదా ఇన్ని అప్పులు చేసిన,ఈ ప్రభుత్వం ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన హామీలు నెరవేర్చడం కోసం ఆదాయ వనరుల అవసరం గత ప్రభుత్వం చేసిన అప్పులు వడ్డీ కట్టలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నది దానికి కారణం మీరు మీ ప్రభుత్వం కాదా,ఆనాడు మీ ప్రభుత్వం ఉన్నప్పుడు అక్రమ ఇసుక రవాణా వల్ల ఓవర్ లోడ్ ఇసుక వల్ల ఈ ప్రాంతానికి సంబంధించి ఎంతోమంది ప్రాణాలు కాళ్లు చేతులుకోల్పోతే ఆనాడు వాళ్లకు అండగా మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు ఉండి వాళ్ళ కుటుంబాలకు న్యాయం కోసం రోడ్డెక్కి కొట్లాడితే మా మీద కేసులు పెట్టి మమ్ములను పోలీస్ స్టేషన్లో పెట్టింది.ఆపై కేసులు వేసి కోర్టు చుట్టూ తిప్పింది మీరు కాదా,కావాలంటే నిజానిజాల కోసం,ఆనాడు టీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇసుక లారీల వల్ల చనిపోయిన కుటుంబాల వద్దకు వెళ్లి మీరు ఏం న్యాయం చేశారు.మాట్లాడడానికి మీరు సిద్ధమా మేము సిద్ధం,ఎవరివల్ల నష్టం జరిగిందో వారే చెప్తారు.ఎవరు వారి కోసం కొట్లాడారు ఎవరితో న్యాయం జరిగిందో వారు చెబుతారు,మీరు మాట్లాడితే జనం నవ్వుతారు.మీరు కూడా టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నారు.అప్పుడు ప్రమాదాలు జరిగినాయా లేవా రాజకీయాలు చేయవద్దని అవసరమైతే ఆ కుటుంబాలకు న్యాయం కోసం మాట్లాడాలి గాని రాజకీయం చేసి పబ్బం గడుపుకోవాలని చూస్తే ఊరుకునే వారు లేరని,ఆ కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ పరంగా శ్రీధర్ బాబు పరంగా తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తామని, మంత్రి అన్నారు .అధికారులకు పోలీస్ చెకపోస్టు ఏర్పాటు చేసి అధికారులకు ఆదేశాలు ఇచ్చినారు.ఒకవేళ మీకు అక్రమాలు జరిగినట్టు అనిపిస్తే మీరు అడ్డుకోవచ్చు అని పేర్కొన్నారు.అనవసరమైన లేనిపోని ఆరోపణ చేస్తే జనం చీకొడతారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొడ్డ బాపు,మంథని అసెంబ్లీ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బర్ల శ్రీనివాస్,తాజా మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్,కోరుకొప్పుల నీరజా తులసిరామ్ గౌడ్,మాజీ జెడ్పిటిసి సభ్యులు ఎల్లే శశిరేఖ రామూర్తి,మైదం భారతి వరప్రసాద్,గంట వెంకటరమణారెడ్డి,మాజీ ఎంపిటీసీ తీగల సమ్మయ్య,రామగిరి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మోత్కూరి అవినాష్ గౌడ్,బీసీ సెల్ మండల అధ్యక్షులు బండారి సదానందం,మాజీ ఎంపిటీసీ గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ దేవరామస్వామి,బంకు మల్లేష్ పొన్నం సత్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

# ఇరవై రోజుల ముందుగానే బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిన ఓ.సి.పి-2

**- ఆర్.జీ-3 ఏరియా జి.యం**

**కరపత్రం రామగిరి ప్రతినిధి, మార్చ్ 12.**




2024-25 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించినందుకు గాను ఓసిపి-2 అధికారులకు,ఉద్యోగులకు రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి యాజమాన్యం ఓసిపి-2 ఉపరితల గనికి నిర్దేశించిన 27.50 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 100 శాతం అనగా 27.52 లక్షల టన్నుల బొగ్గును ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి 20 రోజుల ముందుగానే ఉత్పత్తి చేసినందుకు సంబంధిత అధికారులకు,ఉద్యోగులకు అభినందనలు తెలియజేశారు.లక్ష్యాన్ని సాధించడంలో సహకరించిన సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ కు,డైరెక్టర్లకు,కార్మిక సంఘాల నాయకులకు,ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులకు,స్థానిక ప్రజా ప్రతినిధులకు,పరిసర ప్రాంతాల ప్రజలకు,పాత్రికేయులకు కృతజ్ఞతలు తెలిపారు.అంతేకాకుండా నిర్దేశించిన గడువులోపు బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడానికి ఓసిపి-2 ఉపరితల గని విస్తరణలో ఎప్పటికప్పుడూ తగిన సహాయ సహకారాలను అందిస్తున్న తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఉద్యోగులందరూ భవిష్యత్తులో ఇదే ఒరవడిని కొనసాగిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధిస్తూ,సింగరేణి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

# అట్టహాసంగా మల్లిఖార్జున స్వామి కమాన్ ఆర్చికి గ్రామస్థుల తో భూమి పూజ కార్యక్రమం

**- పాల్గొన్న ప్రజా సంఘాల జాతీయ నాయకుడు పోలాడి రామారావు.**

**కరపత్రం శంకరపట్నం మార్చి 12**
కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల వన్నారం గ్రామంలో వన్నారం గ్రామం నుంచి గంగిపల్లి గ్రామ ప్రధాన రహదారిలో గల గంగిపల్లి గ్రామ శివారులో నెలకొన్న భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి దేవాలయ కమాన్ ఆర్చి నిర్మాణానికి వన్నారం గ్రామ ప్రధాన రహదారి ముఖ ద్వారం వద్ద బుధవారం వన్నారం గ్రామ ప్రజల అట్టహాసంగా భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో వన్నారం గ్రామానికే చెందిన సీనియర్ సిటిజన్ రైతు







ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ నాయకుడు పోలాడి రామారావు గ్రామ పంచాయతి సెక్రటరీ శారద, మాజీ సర్పంచులు భాకారపు శ్రీనివాస్, మద్దెల లక్ష్మయ్య , మార్కెట్ కమిటీ డైరెక్టర్ చలిగంటి ఓదెలు,మాజీ ఎంపీటీసీ గంగుల రవి, మాజీ ఉపసర్పంచులు బకారపు తిరుపతి, బుద్దుల తిరుపతి, సీనియర్ సిటిజన్లు పోలాడి యాదగిరిరావు, సంబ కొమురయ్య, తాల్లపల్లి కొమురయ్య , ఒడ్నాల బాలింగం, పోలాడి ప్రభాకర్ రావు, ఆకునూరి లచ్చయ్య , మద్దెల స్వామి, శివరాత్రి కొమరయ్య, బాకారపు ఓదెలు, బాకారపు మల్లేష్, మద్దెల చంద్రయ్య, బొంపెల్లి స్వామి, రావుల అశోక్,పూజారి సంతోష్ తదితరుల తో పాటు గ్రామ పంచాయతి ఉద్యోగులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున ఉత్సాహ భరితంగా పాల్గొని దేవాలయ కమాన్ ఆర్చి నిర్మాణపనులు ప్రారంభించారు.

# రజకులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి...

**- శాసనసభలో ఎస్సీ జాబితా బిల్లు పెట్టాలి..**
**- రజక సంఘం నియోజకవర్గ ఇన్చార్జి శంకరయ్య రజక...**
**కరపత్రం శంకరపట్నం మార్చి 12**



తెలంగాణలో జరిగిన శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రజకులకు ఇచ్చిన హామీలను నేటికీ నెరవేర్చలేదని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వము, ముఖ్యమంత్రి రజకులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, కరీంనగర్ జిల్లా రజక సంఘం మానకొండూర్ నియోజకవర్గ ఇన్చార్జి నాంపల్లి శంకరయ్య రజక ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శంకరయ్య రజక మాట్లాడారు. దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల్లో,2 కేంద్ర పాలిత రాష్ట్రాల్లో రజకులు ఎస్సీ జాబితాలో, కొనసాగుతున్నారని, రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని తెలంగాణలో రజక సంఘాల ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేయడం జరుగుతుందని, రజకుల పోరాటాలను పట్టించుకోని నాటి బి ఆర్ ఎస ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ కు 2023 సంవత్సరంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో రజకులు తగిన గుణపాఠం చెప్పి, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని రజకులు స్వాగతించి, శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచారని, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి 15 నెలలు గడుస్తున్న తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రివర్గం రజకులను, రజకులకు ఇచ్చిన హామీ విస్మరిస్తూ కాలయాపన చేస్తున్నారని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రివర్గము రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే అందుకు శాసనసభలో తీర్మానం చేసి, కేంద్రం ప్రభుత్వానికి పంపి ,ఇతర రాష్ట్రాల మాదిరిగా తెలంగాణలో రజకులకు ఎస్సీ జాబితాలో హక్కును కల్పించాలని కోరారు. లేకుంటే రజకులందరినీ సంఘటితం చేసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని శంకరయ్య రజక హెచ్చరించారు.